క్లుప్తంగా

అందరికి అందుబాటులో ఉంటా



పెబ్బేరు రూరల్: అందరికీ అందుబాటులో ఉంటూ పోలీస్స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి అన్నారు. పెబ్బేరు ఎస్‌ఐగా మంగళవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలు సహకరించాలని, అక్రమ వ్యాపారాలు, చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడొద్దని సూచించారు. యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా సత్ప్రవర్తనతో మెలగాలని, ఆపద సమయంలో 100కు ఫోన్ చేయాలని కోరారు.

గోపాల్‌పేట ఎస్‌ఐగా హరిప్రసాద్



గోపాల్‌పేట: స్థానిక ఎస్‌ఐగా మంగళవారం హరిప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో పెద్దమందడి మండల ఎస్‌ఐగా విధులు నిర్వహించిన ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. గతంలో గోపాల్‌పేట ఎస్‌ఐగా విధులు నిర్వహించిన వెంకటేశ్వర్లు బదిలీపై ఎస్పీ ఆఫీస్‌కు వెళ్లారు.

విద్యార్థులకు అభినందన



పెబ్బేరు రూరల్: హైదరాబాద్‌లో నిర్వహించిన బ్లాక్‌బెల్ట్ టెస్టు పోటీల్లో పెబ్బేరు సుమన్ కరాటే అకాడమీ విద్యార్థులు ట్వింకిల్‌రెడ్డి, చక్రధర్‌సాగర్, మోక్షిత్‌సాగర్, సాయిరోహన్, తస్విన్, జోషిక, చందన, పవన్‌కుమార్ బ్లాక్ బెల్ట్‌లు సాధించారు. మంగళవారం పట్టణ కేంద్రంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి విద్యార్థులకు బెల్ట్ సర్టిఫికెట్లు అందజేస్తూ అభినందించారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్, వెంకటరమణ, రంజిత్‌కుమార్, కరాటే మాస్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



కొత్తకోట: టీఎస్‌సీపీఎస్‌ఈయూ 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను కొత్తకోట ఎమ్మార్సీ వద్ద ఉపాధ్యాయ సంఘం నేతలతో కలిసి ఎంఈఓ కృష్ణయ్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి, కాంప్లెక్స్ హెచ్‌ఎం వివేకానంద, నిర్మలాదేవి, రాజేంద్రప్రసాద్, సూరచంద్రశేఖర్, నరేష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ప్రత్యేక అధికారికి సన్మానం

వీపనగండ్ల: మండలంలోని రంగవరం గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారిగా మండల పంచాయతీ అధికారి శ్రీనివాసరావు మంగళవారం బాధ్యతలు తీసుకున్నారు. గ్రామాభివృద్ధిలో ప్రజలు, మాజీ ప్రజాప్రతినిధులు తమవంతు సహకారాన్ని అందించాలని ఈ సందర్భంగా ఎంపీఓ గ్రామస్తులను కోరారు. ఈ సందర్భంగా గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బుచ్చన్నసాగర్ ఎంపీఓను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాలశేషు, ఉపాధ్యాయులు సుధాకర్, రమేష్, అంగన్‌వాడీ టీచర్ చంద్రకళ, ఆశావర్కర్లు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

జములమ్మ ఆలయానికి రేకుల షెడ్ ఏర్పాటు



అమరచింత: పట్టణంలోని జములమ్మ దేవత ఆలయ గర్భగుడిపై భాగంలో రేకుల షెడ్ నిర్మాణం కోసం పట్టణానికి చెందిన బావండ్ల రఘు, వెంకటేష్ సోదరులు ముందుకు వచ్చారు. సుమారు రూ.88 వేల ఖర్చుతో గర్భగుడిలో రేకుల షెడ్ నిర్మాణ పనులు పూర్తి చేసి తమ భక్తిని చాటుకున్నారు. జములమ్మ ఆలయ అభివృద్ధిలో తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని వారు తెలిపారు. ఈమేరకు ఆలయంలో మంగళవారం పూజల అనంతరం దాతలకు శాలువ, పూలమాలతో సత్కరించామని ఆయల అధ్యక్షుడు మంగలి నరసింహులు తెలిపారు.

పాఠశాలల అభివృద్ధికి పాటుపడాలి

వనపర్తి టౌన్: పాఠశాలల అభివృద్ధికి ఆయా పాఠశాలల్లో చదివి ఉన్నతంగా ఎదిగిన విద్యార్థులు అవసరమైన వనరులను అందించేందుకు ముందుకురావాలని సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ పిలుపునిచ్చారు. 1999–2000 విద్యా సంవత్సరంలో పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వపు విద్యార్థులు హరిజనవాడ పాఠశాలకు రూ.20వేల విలువ గల మైక్ సౌండ్ సిస్టం, పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు మంగళవారం అందించారు. కార్యక్రమంలో పాఠశాల జీహెచ్‌ఎం చంద్రశేఖర్, బైరోజు చంద్రశేఖర్, కవి, గాయకుడు సత్తార్,నాగరాజు, పూర్వపు విద్యార్థులు స్వాతి, మహ్మద్ ఆరీఫ్, నవీన్, అబుబకార్, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఈదమ్మ ఉత్సవాలకు పోటెత్తిన భక్తులు

- ఘనంగా షిడే ఉత్సవాలు
- బోనంతో భక్తుల ప్రదక్షణలు
- అమ్మవారిని దర్శించుకున్న మంత్రి జూపల్లి, ఎమ్మెల్యే మేఘారెడ్డి



ఈదమ్మ గుడి చుట్టు బోనాలతో మహిళలు

పాన్‌గల్: అమ్మవారికి మొక్కులు చెల్లించుకునేందుకు జాతరకు వేలాదిగా జనం తరలిరావడంతో ఈదమ్మ ఆలయ ప్రాంగణం భక్తజన సంద్రంగా మారింది. ఉమ్మడి పాలమూరు జిల్లాలో ప్రఖ్యాతిగాంచిన ఈదమ్మ జాతర ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో గుడి చుట్టూ ప్రదర్శనలు చేస్తూ అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. జాతర సందర్భంగా షిడేకు గొర్రె పిల్లను కట్టి గుడి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేసినప్పటికీ అనుకున్నదాని కంటే భారీ సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఏర్పాట్లు ఏమాత్రం సరిపోలేదు. దీంతో భక్తులు కొంత అసహనం వ్యక్తం చేశారు.

ఎద్దుల బండ్ల ర్యాలీ

షిడే ఉత్సవాలను తిలకించేందుకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు ఎడ్లబండ్లు, ట్రాక్టర్లలో జాతర ప్రాంతానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మిఠాయి దుకాణాలు, రంగుల రట్నం, ఉయ్యాలలు, గాజుల దుకాణాలు తదితర షాపులన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా వనపర్తి సీఐ నాగభూషన్‌రావు ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన తొమ్మిది మంది ఎస్‌ఐలు, పోలీసులతో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

అమ్మవారిని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, ఎంపీటీసీ హైమావతి, రాముయాదవ్, రవికుమార్, భాస్కర్‌యాదవ్, తహసీల్దార్ అశోక్‌నాయుడు, ఆలయ కమిటీ సభ్యులు, పూజారి నాగన్న తదితరులు పాల్గొన్నారు.



గాజులు వేయించుకుంటున్న మహిళలు



కుండలు కొనుగోలు చేస్తున్న భక్తులు



అలంకరించిన బోనం కుండలు



జాతరలో వెలిసిన చెరుకు గడల దుకాణం

విద్యార్థుల సామర్థ్యాలు పెంచేలా బోధన



మాట్లాడుతున్న ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్

పాన్‌గల్: వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి ప్రతి విద్యార్థి సామర్థ్యాలు పెంచేలా బోధన సాగాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల మండల స్థాయి కాంప్లెక్స్ సమావేశం రెండో రోజు మంగళవారం కొనసాగింది. ఈ సందర్భంగా తొలిమెట్టు మౌలిక భాషా గణిత సామర్థ్యాల సాధనపై పాఠశాలల వారీగా విద్యార్థుల సామర్థ్యాలపై ఆరా తీశారు. ఎఫ్ఎల్ఎన్ అమలు, విద్యార్థుల కనీస సామర్థ్యాలను సాధించేందుకు విద్యార్థుల చేత వర్క్ షీట్లను ప్రాక్టీస్ చేయించాలన్నారు. ప్రతి నిత్యం విద్యార్థుల ఎఫ్ఆర్ఎస్ హాజరు శాతం 80 పైగా ఉండేలా చూడాలని సూచించారు. తెలుగు, ఇంగ్లీష్, గణితం సబ్జెక్టులపై ఆర్పీలచే ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీరాములు, రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేద్దాం



గోపల్‌దిన్నెలో ఇంటింటి ప్రచారం చేస్తున్న రైతు సంఘం నాయకులు

వీపనగండ్ల: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16వ తేదీన నిర్వహించనున్న దేశవ్యాప్త నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం గోపల్‌దిన్నెలో రైతు సంఘం నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న మతతత్వ విధానాల వల్ల ప్రజల జీవన ప్రమాణాలు పూర్తిగా పడిపోయాయని అన్నారు. కార్యక్రమంలో భాస్కర్, జితేందర్, కిరణ్, చంద్రయ్య, రాముడు, కిష్టన్న తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌పేట: ఆశావర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వారికి పేస్కేల్ అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆశాడే సందర్భంగా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశాలతో సమావేశమయ్యారు. ఆశావర్కర్లను ప్రబుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈనెల 16న దేశవ్యాప్తంగా జరుగుతున్న సమ్మెలో అందరూ పాల్గొనాని కోరారు.

దళిత క్రిస్టియన్ల అభ్యున్నతికి కృషి

కొత్తకోట రూరల్: దళిత క్రిస్టియన్ దండోరా జిల్లా అధ్యక్షుడిగా కొత్తకోట పట్టణ కేంద్రానికి చెందిన నారమాన్ ప్రవీణ్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్లు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు మామిడి సామేల్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం నారమాన్ ప్రవీణ్‌కు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి జిల్లా బాధ్యతలు అప్పగించిన మండల, ఉమ్మడి జిల్లా, రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలపారు. దళితుల అభ్యున్నతికి తనవంతు కృషి చేస్తానని, దళితుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు నిరంతరం శ్రమిస్తానన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నర్సింహులు, బాలరాజు, జాన్సన్‌బాబు, శేషు, జపాన్, రవి, కిరణ్ తదితరులు ఉన్నారు.

సీఐ సీతయ్య ఔదార్యం

అమరచింత: పట్టణంలోని రాజావళీ దర్గా సమీపంలో ఒంటరిగా నివసిస్తున్న అనాథ రజక మహిళ నర్సమ్మ దహన సంస్కారాలకు సీఐ సీతయ్య ఆర్థికసాయం అందించి తన ఔదార్యం చాటుకున్నారు. మృతురాలు నర్సమ్మ కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతుండేది. నర్సమ్మకు ఆడపిల్లలు ఉండటంతో వారికి వివాహం జరిపించడంతో పట్టణంలో ఒంటరిగా నివసిస్తుండేది. సమయానికి ఆహారం లేక అలమటిస్తున్న సందర్భంలో అప్పట్లో ఆత్మకూర్ సీఐగా విధులు నిర్వహిస్తున్న సీతయ్య నర్సమ్మకు ఆర్థికసాయం అందిస్తుండేవారు. ప్రస్తుతం హైదరాబాద్ చిక్కడపల్లిలో సీఐగా విధులు నిర్వహిస్తున్న ఆయన నర్సమ్మ మృతి వార్త హోంగార్డు శ్రీహరి ద్వారా తెలుసుకుని దహన సంస్కారాల కోసం రూ.ఐదు వేలు పంపించారని రజక సంఘం నాయకులు తెలిపారు.

ఆరు గ్యారంటీల అమలులో జాప్యం వద్దు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

కొత్తకోట రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలలో భాగంగా రెండు పథకాల్లో ఒకటి 200యూనిట్ల విద్యుత్ ఉచితం, రెండోది రూ.500 గ్యాస్ సిలిండర్‌ను ఈనెల 8న జరిగే అసెంబ్లీ సమావేశాల్లోనే తీర్మానం చేసి వెంటనే ప్రారంభించాలని బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ బాల్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. 10ఏళ్లుగా రేషన్ కార్డులు లేక సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, ప్రజాపాలనలో రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసున్న అర్హులైన వారికి రేషన్ కార్డులు వెంటనే మంజూరు చేయాలని కోరారు. అర్హులైన వారికి రేషన్ కార్డుతో సంబంధం లేకుండా ఆరు గ్యారంటీలు వర్తించే విధంగా చూడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నవీన్‌కుమార్‌రెడ్డి, కోటేశ్వర్‌రెడ్డి, భరత్‌భూషణ్, బాలస్వామి, అమరేందర్‌రెడ్డి, లచ్చగౌడ్, మొగులన్న, రాజారాం, చీర్ల నర్సింహ తదితరులు ఉన్నారు.

నులిపురుగుల నివారణే లక్ష్యం



మాట్లాడుతున్న హెల్త్ ఆఫీసర్ రామయ్య

పాన్‌గల్: ఈనెల 12వ తేదీన నిర్వహించే జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు సమన్వయంతో విజయవంతం చేయాలని పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఆశాలు, వైద్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జాతీయ నులిపురుగుల దినోత్సవం, ఈనెల 13వ తేదీ నుంచి 19వ తేదీ వరకు నిర్వహించే విటమిన్ పంపిణీ కార్యక్రమం, వైద్య సేవలు తదితర అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. వారికి కేటాయించిన గ్రామాల్లో అందుబాటులో ఉంటూ వైద్య కార్యక్రమాలు, పీహెచ్‌సీలలో కాన్పుల సంఖ్య పెంపు వంటి అంశాలపై దృష్టి సారించాలని ఆదేశించారు. సమావేశంలో ఎంఎల్‌హెచ్‌పీ నాగరాజు, శ్రీకాంత్, సూపర్‌వైజర్లు శ్రీనివాసులు, సంతోషమ్మ, సుమనశ్రీ, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రజక సొసైటీల పరిశీలన

ఖిల్లాఘనపురం: మండలంలోని మానాజీపేటలో మంగళవారం పరమేశ్వర, శివకేశవ రజక సంఘాల సభ్యుల వివరాలను జిల్లా బీసీ సొసైటీల అధికారి సలీమ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రిజిస్ట్రేషన్ చేయించుకున్న రజక సంఘాల వివరాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. 2017–18 ఆర్థిక సంవత్సరంలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న సంఘాల వివరాలను పరిశీలించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. కమిటీల్లో ఉన్న అధ్యక్ష, కార్యదర్శుల మార్పులు చేర్పులు గురించి తెలుసుకుని నమోదు చేస్తామన్నారు. ఈ వివరాల ప్రకారమే త్వరలో రాష్ట్ర ప్రభుత్వం రుణాలు ఇచ్చే అవకాశం ఉందని వివరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్, మానాజీపేట సంఘాల సభ్యులు పాలకొండ అంజనేయులు, సత్యమ్మ, లక్ష్మి, చంద్రయ్య, వెంకటమ్మ, శారదమ్మ, అంజనేయులు, రాములు తదితరులు పాల్గొన్నారు.



బాల్క సుమన్ దిష్టిబొమ్మ దహనం



వనపర్తిలో బాల్కన్ సుమన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వనపర్తి టౌన్: బీఆర్ఎస్ నేత బాల్కన్ సుమన్ సీఎం రేవంత్‌రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ ఆందోళనకు దిగింది. ఇందులో భాగంగా మంగళవారం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చీర్ల విజయచందర్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్‌లో బాల్కన్ సుమన్ దిష్టిబొమ్మ దహనం చేయగా, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ కదిరె రాములు ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, కాంగ్రెస్ సీనియర్ నేత బి.శ్రీనివాస్‌గౌడ్ రాజీవ్ చౌక్‌లో బాల్కన్ సుమన్ చిత్రపటానికి చెప్పుల దండ వేసి నిరసన వ్యక్తం చేశారు. అదేవిధంగా బాల్క సుమన్ తీరు సరైంది కాదని తెలంగాణ జనసమితి జిల్లా అధ్యక్షుడు ఖాదర్ పాషా మండిపడ్డారు. స్థాయికి మించి మాట్లాడొద్దని హితవుపలికారు. కార్యక్రమంలో లక్కాకుల సతీష్, కౌన్సిలర్లు వెంకటేష్, బ్రహ్మం, విభూది నారాయణ, చీర్ల సత్యం, నాయకులు మధుగౌడ్, యాదగిరి, రవికుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

కొత్తకోట రూరల్: పెద్దమందడి పోలీస్‌స్టేషన్‌లో స్థానిక కాంగ్రెస్ నాయకులు బాల్కసుమన్‌పై ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ శ్రేణులు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడకపోతే కాంగ్రెస్ కార్యకర్తల ఆగ్రహానికి గురికావడం తప్పదని పెద్దమందడి కాంగ్రెస్ మండల అధ్యక్షులు పెంటన్నయాదవ్, ఎంపీపీ రఘుప్రసాద్ అన్నారు. కార్యక్రమంలో గట్టుమన్యం, సుదర్శన్‌రెడ్డి, రాజు, లక్ష్మీకాంత్‌రెడ్డి, సురేష్, శివరాజు, రాజవర్ధన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, బాలయ్య, బుడ్డన్న తదితరులు ఉన్నారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ శ్రేణులు బాల్కసుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఆయనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌యాదవ్, మండల అధ్యక్షుడు రాములుయాదవ్, నాయకులు ప్రవీణ్‌కుమార్, కుమ్మరి నాగన్న, గంగన్న, కృష్ణయ్య, గోవిందు ఇమ్రాన్, చందు, వెంకటయ్య పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: బాల్కసుమన్ సోమవారం ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేయడంపై మంగళవారం కాంగ్రెస్ నాయకులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్, రమేష్, వెంకటేశ్వర్ రావు, రామకృష్ణారెడ్డి, దేవిజానాయక్, నర్సింహారెడ్డి, విష్ణు, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేస్తాం



పెబ్బేరులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

పెబ్బేరు రూరల్: రహదారి విస్తరణలో ఇళ్లు, దుకాణ సముదాయాలు కోల్పోయిన వారికి న్యాయం చేస్తామని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, మున్సిపల్ చైర్మన్ ఎద్దుల కరుణశ్రీతో కలిసి పెబ్బేరులో పర్యటించారు. పట్టణంలోని సుభాష్ చౌరస్తా నుంచి పీజేపీ కేంద్రం వరకు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని, జూనియర్ కళాశాల రహదారిని సీసీగా మార్చాలని, రహదారి విస్తరణలో ఇళ్లు కోల్పోయిన వారికి రెండు పడక గదుల ఇళ్లు మంజూరు చేయాలని, ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని ప్రజలు ఎమ్మెల్యేకు విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలోనే రహదారి విస్తరణలో ఇళ్లు, వ్యాపార సముదాయాలు కోల్పోయిన వారితో ప్రత్యేక సమావేశం నిర్వహించి సరైన న్యాయం చేస్తామని తెలిపారు. ఈ నెల 11, 12 తేదీల్లో జరిగే చౌడేశ్వరి ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. అనంతరం బస్టాండ్ ఆవరణను పరిశీలించి సీసీ నిర్మాణం, మౌలిక వసతుల కల్పనపై దృష్టిసారించి అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి రోగులకు అందుతున్న వైద్యసేవలపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వంతో మాట్లాడి 30 పడకల ఆస్పత్రిగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఇటీవల విధుల్లో చేరిన స్టాఫ్ నర్సులను సన్మానించారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌ను సందర్శించి విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వం, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ నిజాన్ని నిర్భయంగా ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేయడమే జర్నలిస్టుల పని అని పేర్కొన్నారు. ప్రజలను చైతన్యం చేసేలా వార్తలు రాయాలని సూచించారు. శిథిలావస్థకు చేరిన ప్రెస్‌క్లబ్ భవన పునర్నిర్మాణానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ప్రెస్‌క్లబ్ కార్యవర్గాన్ని సన్మానించారు.

అసంపూర్తి నిర్మాణాలు పూర్తిచేస్తాం..

గోపాల్‌పేట: నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణాలను త్వరగా పూర్తిచేసి వినియోగంలోకి తీసుకొస్తామని ఎమ్మెలే తూడి మేఘారెడ్డి అన్నారు. మంగళవారం ఏదుల తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ల విభాగాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి ఐదు గ్రామాలు, గోపాల్‌పేట, రేవల్లి మండలాల నుంచి కొన్ని గ్రామాలు తీసుకొని ఏదుల మండలం ఏర్పాటు చేశామని.. త్వరలోనే అన్ని కార్యాలయాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామ అభివృద్ధికి ఇప్పటికే రూ.20 లక్షలు మంజూరు చేశామని చెప్పారు. కార్యక్రమంలో ఉమ్మడి మండలాల ఇన్‌చార్జ్ సత్యశిలారెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ గోపాల్‌యాదవ్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ చక్రపాణి, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీజేపీని విమర్శిస్తే ఊరుకునేది లేదు



పెబ్బేరులో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

పెబ్బేరు రూరల్: హిందువుల ఆరాధ్య దైవమైన రాముడి అక్షింతలపై కాంగ్రెస్ పార్టీ నాయకులు నీచంగా మాట్లాడడం, బీజేపీని విమర్శిస్తే ఊరుకునేది లేదని బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఆంజనేయులు హెచ్చరించారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో బీజేపీ మండల నాయకులు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ ప్రజలకు అక్షింతలు కాదు.. ఉచిత వైద్యం అందించండి అని కాంగ్రెస్ నాయకులు చేసిన ఆరోపణలపై వారు మండిపడ్డారు. అక్షింతలు అనే పేరుతో నీచ రాజకీయం చేస్తున్నది కాంగ్రెస్ పార్టీ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయోధ్యలో రామాలయాన్ని కట్టింది బీజేపీ కాదని, రామజన్మ భూమి ట్రస్టు అని స్పష్టతనిచ్చారు. దేశంలో మతతత్వ రాజకీయాలు చేస్తున్నది కాంగ్రెస్ పార్టీ అని తూర్పారపట్టారు. కర్ణాటకలో వారంలోని అన్ని రోజుల్లో ఉదయం పూట ఎగ్జామ్స్ నిర్వహించి శుక్రవారం మాత్రం ముస్లిం మైనార్టీల కోసం మధ్యాహ్న సమయంలో నిర్వహించడం ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో గొని వేమారెడ్డి, క్రాంతి, వేణు, దిలీప్‌కుమార్ రెడ్డి, గోవర్ధన్, రామకృష్ణ, రాకేష్‌గౌడ్ పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: భారతదేశ అభివృద్ధి ప్రధాన మంత్రి నరేంద్రమోదీతోనే సాధ్యమని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బుచ్చిబాబుగౌడు, మండల ఇన్‌చార్జు శ్రీశైలం, సీనియర్ నాయకులు విక్రం, మండల ప్రధాన కార్యదర్శి శివశంకర్ అన్నారు. మంగళవారం మండలంలోని గట్టుకాడిపల్లి, వెంకటాంపల్లి, ఖిల్లాఘనపురం తండాల్లో గావ్ చలో అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల బీజేపీ నాయకులు గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి అశన్న, జిల్లా నాయకులు కొరిగెల గోపి తదితరులు పాల్గొన్నారు.

దాడి ఘటనలో కేసు నమోదు

పెబ్బేరు రూరల్: దాడి ఘటనలో నలుగురు వ్యక్తులపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటస్వామి తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు శ్రీరంగాపురం మండలంలోని తాటిపాములకు చెందిన వెంకటయ్య భార్య మన్నెమ్మపై నలుగురు వ్యక్తులు వెంకటయ్య, నాగేంద్రమ్మ, రాముడు, ఎల్లమ్మ కలిసి దాడి చేయడంతో బాధితుడు వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ తెలిపారు.

పోస్టుకార్డు ఉద్యమం

కొత్తకోట రూరల్: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న సమస్యలు స్వయంగా విద్యార్థులే సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టు కార్డు ద్వారా తెలిపే విధంగా పోస్ట్ కార్డు ఉద్యమాన్ని 'డయల్ యువర్ విలేజ్' కార్యక్రమాన్ని ఎస్ఆర్ఐ సంస్థ నిర్వహిస్తోంది. అందులో భాగంగా మంగళవారం కొత్తకోటలోని ప్రభుత్వ పాఠశాలలలో స్థానిక జేఎస్ఆర్ ఫౌండేషన్ నిర్వాహకులు విద్యార్థులచే పోస్టు కార్డులు రాసే కార్యక్రమం ఏర్పాటుచేశారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలో సరైన తరగతి గదులు, గ్రంథాలయం, సైన్స్ ల్యాబ్ వంటి లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఈ పోస్టు కార్డు ఉద్యమాన్ని ఉధృతం చేసి సీఎం రేవంత్‌రెడ్డికి సమస్యలు తెలిసేవిధంగా కృషి చేస్తామని సంస్థ నిర్వహకులు సతీష్‌రాజ్ తెలిపారు.

లారీ, బైక్ ఢీకొని ఒకరి దుర్మరణం

పెబ్బేరు రూరల్: బైక్‌ను వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందగా.. మరొకరికి స్వల్ప గాయాలయిన ఘటన మంగళవారం రంగాపురం బస్టాప్ వద్ద జాతీయ రహదారి 44పై చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఇటిక్యాల మండలంలోని చనగోనిపల్లికి చెందిన నాగన్నగౌడ్ మనువరాలు పెబ్బేరులో చదువుకుంటుండడంతో ఆమెను చూసేందుకు వీరన్నగౌడ్‌తో కలిసి బైక్‌పై వచ్చి గ్రామానికి తిరిగి వెళ్తున్నారు. రంగాపురం బస్‌స్టాప్ దగ్గర వీరు వెళ్తున్న బైక్‌ను వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో నాగన్నగౌడ్ (55) తీవ్రంగా గాయపడ్డారు. అతడిని అంబులెన్స్‌లో వనపర్తి జిల్లా ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో మృతి చెందాడు. వీరన్నగౌడ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మృతుడి కుమారుడు మోహన్‌గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు.